క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పిస్తాం

ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని వసతులు కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 16 పోలింగ్ బూత్‌లను కమిషనర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, సీడీఎం నుంచి ఆదేశాలు జారీచేశారని తెలిపారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సక్రమంగా లేదని తెలిపారు. అలాగే ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఓటర్లకు, అధికారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. మున్సిపాలిటీ నుంచి అవసరమైన నిధులు వెచ్చించి ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎక్కడ సమస్యలు ఉన్నా మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండికి చెందిన పన్నీ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని స్థానిక బీజేపీ నాయకులు రాందాస్‌నాయక్ పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. ఆయనవెంట పంతు, సోమ్లా, విశాల్, బిక్కు, కల్యాన్ తదితరులు ఉన్నారు.

పడకల్‌లో బీజేపీ కార్యాలయం ప్రారంభం



బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సంలో నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్‌లో శుక్రవారం బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని కల్వకుర్తి బీజేవైఎం కన్వీనర్ పద్మ అనిల్ ప్రారంభించారు. బీజేపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు. బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పాండు, చంద్రధన సర్పంచ్ కుమార్, ఎంపీటీసీ హేమరాజు, మండల బీజేపీ అధ్యక్షుడు రవి గౌడ్, నాయకులు పాండు, జయమ్మ, గణేశ్, ప్రకాశ్, వెంకటేశ్, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ పండుగ



గ్యార్మీ వేడుకలో మతపెద్దలు, నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ మసీదు కమిటీ అధ్యక్షుడు గౌస్ మైనొద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్యార్మీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు కొత్తకోటకు చెందిన మత గురువు హుస్సేన్ ఖాద్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని మహబూబ్ సుభానీ దర్గా వద్ద గ్యార్మీ జెండాను ఆవిష్కరించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఫాతేహాలు సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మాసూం, ఖాదర్‌ఖాద్రి, ఖలీల్, సయ్యద్ ఖలీల్, ఖాదర్, అలీబేగ్, జబ్బార్, కరీం, రవూఫ్, జహంగీర్, హఫీజ్, నాజర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పడకల్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ సహకారంతో శుక్రవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. మొక్కజొన్నకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2,090 చెల్లిస్తుందని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న రామకృష్ణ

యాచారం: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల క్యాంపెయిన్ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా యాచారం మండలం గునుగల్‌కి చెందిన మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ యాదవ్ నియమితులయ్యారు.ఈ మేరకు శుక్రవారం ఆ కమిటీ రాష్ట్ర చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఉత్తర్వులు జారీచేయడంతో పాటు రామకృష్ణకు నియామకపత్రం అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రచారం చేయాలని మధుయాష్కీగౌడ్ సూచించినట్లు రామకృష్ణ తెలిపారు.



పెద్దఅంబర్‌పేటలోని అర్బన్ ఫారెస్ట్ పార్కు



వాకింగ్ ట్రాక్‌పై పెరిగిన పిచ్చిమొక్కలు

అలంకారప్రాయం

- శిథిలావస్థలో అర్బన్ ఫారెస్ట్ పార్కు
- రెండేళ్ల క్రితం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం
- ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి తేని వైనం

అబ్దుల్లాపూర్‌మెట్: హెచ్‌ఎండీఏ, రాష్ట్ర అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన అర్బన్ ఫారెస్ట్ పార్కు అలంకారప్రాయంగా మారింది. రాష్ట్ర మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి, సబితారెడ్డి చేతుల మీదుగా రెండేళ్ల క్రితం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన ఈ పార్కును ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు అధికారులు. నగర శివారు ప్రజలతో పాటు ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణించే వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన పెద్దఅంబర్‌పేట అర్బన్ ఫారెస్ట్ పార్కు నిర్లక్ష్యానికి గురవుతోంది.

పార్కులోని వసతులు ...

ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు పచ్చని చెట్లు, ఔషధ మొక్కలను నాటడంతో పాటు వాకింగ్‌ట్రాక్, యోగా సెంటర్, విశ్రాంతి భవనంతో పాటు కూర్చునేందుకు బల్లలను కూడా ఏర్పాటు చేశారు. అయితే వాడుకలోకి తీసుకురాకపోవడంతో.. నిర్వహణ లోపం కారణంగా విశ్రాంతి భవనం, యోగా కేంద్రాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వాకింగ్‌ట్రాక్‌పై గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగాయి. వెంటనే మరమ్మతులు చేపట్టడంతో పాటు సుందరీకరణ పనులు చేపట్టి ప్రజలకు అర్బన్ ఫారెస్టును అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి

మా కాలనీకి సమీపంలో అర్బన్ ఫారెస్ట్ పార్కు ప్రారంభించినపుడు చాలా సంతోషపడ్డాం. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయడంతో పాటు యోగా సాధన చేసుకునే అవకాశముంటుందని నాతో పాటు మా మిత్రులంతా ఒక టైంటేబుల్ వేసుకున్నాం. అయితే రెండేళ్లైనా పార్కును అందుబాటులోకి తేలేదు. పార్కు ఓపెన్ ఉందేమోనని ప్రతిరోజు వందలాది మంది వచ్చి నిరాశగా వెళ్తున్నారు. త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి.

– ప్రభాకర్‌రెడ్డి, పెద్దఅంబర్‌పేట

బీజేపీతోనే అవినీతిరహిత పాలన

కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి ఆచారి



ప్రచార సభలో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: బీజేపీతోనే అవినీతి రహిత పాలన సాధ్యమని ఆ పార్టీ కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి అన్నారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి, గౌరిపల్లి, ఆకుతోటపల్లిలో శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆచారి పాల్గొన్నారు. ఆచారి మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంత పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఓటు అనే ఆయుధంతో కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. కల్వకుర్తి నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుబాటుకు గురైందని అన్నారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డికి ఓట్లడిగే నైతికహక్కు లేదని అన్నారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే ప్రజల కోసం నిరంతరం పనిచేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆకుతోటపల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఆచారి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. మాజీ జెడ్పీటీసీ హరిప్రసాద్, బీజేపీ నాయకులు కమలేశ్, నర్సింహ, శ్రీను, విక్రంరెడ్డి, రవిరాథోడ్, శ్రీను, లక్ష్మణ్‌రావ్, ప్రశాంత్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

యాచారం: ఇబ్రహీంపట్నం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్‌ను అత్యధిక మెజార్టీతోని గెలిపిస్తే ఫార్మాసిటీ రద్దుకు కృషి చేస్తామని ఆపార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో శుక్రవారం బీజేపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. దయానంద్‌గౌడ్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ జంగయ్య, నాయకులు యాదయ్య, కృష్ణ, అచ్చిరెడ్డి, మహేందర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై తిరుగుబాటు మొదలైంది



సమావేశంలో మాట్లాడుతున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి

ఆమనగల్లు: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని.. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కసిరెడ్డి సమక్షంలో మండలంలోని వివిధ తండాలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కసిరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనపై ప్రజలలో తీవ్ర అసంతృప్తి నెలకొని ఉందని అన్నారు. బీఆర్‌ఎస్‌పై ప్రజలు తిరగబడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మరోసారి అధికారాన్ని దక్కించుకునేందుకు సాగిస్తున్న ఎత్తుగడలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని.. ప్రతి ఒక్కరూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అసమర్థత కారణంగా నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని ఆరోపించారు. సొంత గ్రామాన్ని అభివృద్ధి చేసుకోలేని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ప్రజలకు ఏమి మేలు చేస్తాడని ప్రశ్నించారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించండి

మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్



చంద్రధన ప్రచార సభలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌యాదవ్

ఆమనగల్లు: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ రావాలని మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తలకొండపల్లి మండలం చంద్రధనలో కల్వకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా వారు ప్రచారం నిర్వహించారు. గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ విజయాలు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సాధించిన అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం జరిగిన సభలో ఉప్పల వెంకటేశ్, శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ అక్కసు వెళ్లగక్కుతుందని ఆరోపించారు. రైతుబంధుతో పాటు వివిధ సంక్షేమ పథకాలను నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని వారు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి రైతులపై ప్రేమ లేదని వారు ఆరోపించారు. ఎన్నికల్లో లబ్ధిపొందడానికే కాంగ్రెస్ పార్టీ సాధ్యంకాని హామీలను ఇస్తుందని ఆరోపించారు. కల్వకుర్తిలో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ నిర్మల, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రహమాన్, నాయకులు సుధాకర్, రఘువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, రాములు, జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం..

మాడ్గుల: మాడ్గుల మండలం ఫిరోజ్‌నగర్‌లో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కల్వకుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కల్వకుర్తి అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వరుణ్, జీజేవై సేవా సమితి అధ్యక్షుడు శ్రీను, నాయకులు వెంకటయ్య గౌడ్, మల్లేష్, జంగయ్య, గోవర్ధన్, అంజయ్య పాల్గొన్నారు.

తండాలను జీపీలుగా చేశాం



కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న దశరథ్‌నాయక్

జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్

కడ్తాల్: రాష్ట్రంలో తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఉదయం మండల పరిధిలోని మైసిగండిలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ.. కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. అనంతరం మైసిగండిలో 163, 164 బూత్ కమిటీలను ఎన్నుకుని నియామకపత్రాలు అందించారు. అదే విధంగా మండల పరిధిలోని అన్మాస్‌పల్లిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో బూత్ కమిటీని ఎన్నుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, సర్పంచ్ తులసీరాంనాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్, ఉపసర్పంచ్‌లు రమణ, రాజారాం, శారధ నాయకులు వీరయ్య, సేవ్యా, హర్యానాయక్, సక్రి తదితరులు ఉన్నారు.

వెల్జాల్‌లో సద్దుల బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ సంబురాల్లో సర్పంచ్ సంగీత

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం వెల్జాల్‌లో శుక్రవారం సద్దుల బతుకమ్మ పండుగ సంబురాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు వివిధ రకాల పూలతో అలంకరించిన బతుకమ్మలను తీసుకుని భవానీమాత ఆలయంలో బతుకమ్మ ఆటలు ఆడారు. అందంగా అలంకరించిన బతుకమ్మలను తీసుకువచ్చిన మహిళలకు సర్పంచ్ సంగీత బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రెహమాన్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, పోలెపల్లి ఎంపీటీసీ కుమార్, స్థానిక నాయకులు విష్ణువర్ధన్‌యాదవ్, విజయ్‌కుమార్, శ్రీకాంత్, యాదయ్య, వెంకటేశ్, జంగయ్య, ప్రకాష్‌గౌడ్, సుధాకర్, సంపత్, విజయ్, రాజు, గిరి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో బీఆర్‌ఎస్ విఫలం

ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

హయత్‌నగర్: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ ఆరోపించారు. హయత్‌నగర్‌లో ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణచారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బూటకపు హామీలతో బీఆర్‌ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తోందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా పేపర్ల లీకేజీలు జరిగాయని, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, మత్తు మాఫియా విజృంభిస్తుందని, మహిళలకు రక్షణ కరువైందని ఆరోపించారు. ఈనెల 29, 30న జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సభలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కిశోర్, నాయకులు శ్రీనివాస్, దేవేందర్, శ్రీకాంత్, వెంకటేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కుతుందని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం గోలి శ్రీనివాస్‌రెడ్డిని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్, జహంగీర్, సైదులు, సతీష్, కాలె విక్రం, శివ, కిరణ్, పురుషోత్తం, వెంకటయ్య, బీమయ్య తదితరులు పాల్గొన్నారు.

కరోనరీ ఆర్టరీ వ్యాధికి ఏకకాలంలో శస్త్రచికిత్స

మన్సూరాబాద్: జననాంగ కేన్సర్, కరోనరీ ఆర్టరీ వ్యాధికి ఎల్‌బీనగర్‌లోని కామినేని హాస్పిటల్స్ వైద్యులు ఏకకాలంలో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం హాస్పిటల్‌లో వైద్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఒంగోలుకు చెందిన వ్యక్తి (56)ఒక ప్రత్యేకమైన వైద్యపరమైన సవాల్‌తో హాస్పిటల్స్‌కు వచ్చాడన్నారు జననాంగ అల్సర్ రెండు నెలల చరిత్రను చూస్తే కేన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. రోగికి రెండు గుండె ధమనుల సమస్యతో బాధపడుతున్నాడని, రోగికి మధుమేహ వ్యాధి ఉండటంతో శస్త్రచికిత్స హైరిస్క్‌గా మారిందన్నారు. కామినేని హాస్పిటల్స్ వైద్య బృందం సర్జికల్ ఆంకాలజిస్టులు డాక్టర్ కృష్ణకిరణ్, డాక్టర్ రామచంద్ర, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సాగర్ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి రోగికి నూతన జీవితాన్ని అందించామన్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి..

- బావిలో శవమై తేలాడు
- కందుకూరులో విషాదం

కందుకూరు: చేపలు పట్టడానికి రెండు రోజుల క్రితం బావి వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు అదే బావిలో మునిగి మృతి చెందిన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. కందుకూరుకి చెందిన అంజయ్య(42) ట్రాక్టర్ డ్రైవర్‌గా, కూలీగా పనులు చేసుకుంటూ మరోపక్క చేపలు పడుతుంటాడు. ఈనెల 25న గ్రామ సమీపంలోని శివాలయం ఎదుట ఉన్న బావిలో చేపలు పట్టడానికి వల వేశాడు. అదేరోజు రాత్రి 10.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు అంజయ్య కోసం ఎంతగాలించిన ఫలితం లేకుండా పోయింది. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలో బావి వైపు రాత్రి సమయంలో వెళ్తున్నట్లుగా రికార్డు అయింది. దీనికి తోడు ఆ బావి ఒడ్డున అంజయ్య బట్టలు, చెప్పులు లభ్యమయ్యాయి. అదే రోజు సాయంత్రం బావిలో మోటార్ల సహాయంతో నీటిని తోడే ప్రయత్నం చేపట్టారు. అయితే బావిలో నీరు నిండుగా ఉండటంతో పాటు ముళ్లకంపలు ఉండటంతో గాలించడానికి వీలుకాలేదు. శుక్రవారం సాయంత్రం సమాచారం అందుకున్న ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ గోపాల్, సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి తదితరులు ఘటనా స్థలానికి చేరుకుని పర్యవేక్షించారు. మోటార్లతో నీటిని అడుగువరకు తోడటంతో రాత్రి 7 గంటల సమయంలో మృతదేహం బయటపడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఎల్‌బీనగర్: వచ్చే ఎన్నికల్లో శక్తి కేంద్రం, బూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేసి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కర్ణాటక శాసన సభ్యుడు మునిరత్నం నాయుడు అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలో ఉన్న శ్రీ కన్వెన్షన్ హాల్ శుక్రవారం నిర్వహించిన శక్తికేంద్రం, బూత్‌కమిటీల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందే అని అన్నారు. త్వరలోనే అభ్యర్థిని ప్రకటిస్తారని, అందరు బీజేపీ విజయానికి కృషి చేయాలని కోరారు.

పోరు రసవత్తరం

- ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి
- ఇప్పటికే ఖరారైన బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు
- టగ్‌ఆఫ్ వార్ తప్పదంటున్న విశ్లేషకులు



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మ్యాప్

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ అధిష్టానం ఆ పార్టీ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డిని ప్రకటించడంతో నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1994(టీడీపీ), 2004(కాంగ్రెస్)లో మలక్‌పేట్ ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి పనిచేశారు. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం కందుకూర్, మహేశ్వరం మండలాలు మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోకి, హయత్‌నగర్ మండలం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోకి రావడంతో ఈ(ఇబ్రహీంపట్నం)సెగ్మెంట్ ఎస్సీ నుంచి జనరల్ స్థానంగా మారింది. ఈ నేపథ్యంలో 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేశారు. అప్పట్లో ఆయనకు పోటీగా టీడీపీ నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పీఆర్పీ నుంచి తూళ్ల దేవేందర్‌గౌడ్, బీజేపీ నుంచి పోరెడ్డి నర్సింహారెడ్డి బరిలో నిలిచారు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి 56,508 ఓట్లు రాగా.. మల్‌రెడ్డి రంగారెడ్డికి 47,292 ఓట్లు, తూళ్ల దేవేందర్‌గౌడ్‌కు 35,179 ఓట్లు, పోరెడ్డి నర్సింహారెడ్డికి 8,218 ఓట్లు వచ్చాయి. ఆ ఎన్నికల్లో 9,216 ఓట్ల మెజార్టీతో టీడీపీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమీప అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిపై విజయం సాధించారు.

రాష్ట్ర విభజన అనంతరం..

అయితే రాష్ట్ర విభజన అనంతరం జరిగిన 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా మల్‌రెడ్డి రంగారెడ్డి సోదరుడు మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా క్యామ మల్లేశ్, టీఆర్‌ఎస్ అభ్యర్థిగా కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి, సీపీఎం అభ్యర్థిగా పగడాల యాదయ్య, వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఈసీ శేఖర్‌గౌడ్ ప్రధానంగా పోటీపడ్డారు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి 48,397 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి మల్‌రెడ్డి రాంరెడ్డికి 37,341 ఓట్లు, క్యామ మల్లేష్‌కు 36,865 ఓట్లు, కంచర్ల చంద్రశేఖర్ రెడ్డికి 21,779 ఓట్లు, పగడాల యాదయ్యకు 14,902, ఈసీ శేఖర్‌గౌడ్‌కు 10,881 ఓట్లు వచ్చాయి. దీంతో టీడీపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి 11,056 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 2014 ఎన్నికల అనంతరం టీఆర్‌ఎస్‌లో చేరారు.

356 ఓట్లతో మంచిరెడ్డి గెలుపు..

తదనంతరం 2018లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఎస్పీ నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, పొత్తులో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఈ స్థానం టీడీపీకి కేటాయించడంతో సామ రంగారెడ్డి బరిలో నిలిచారు. మంచిరెడ్డికి 72,581 ఓట్లు, మల్‌రెడ్డికి 72,205 ఓట్లు, సామ రంగారెడ్డికి 18,053 ఓట్లు, కొత్త అశోక్‌గౌడ్‌కు 17,129 ఓట్లు వచ్చాయి. బీఎస్పీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిపై టీఆర్‌ఎస్ అభ్యనర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 356 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. తిరిగి ఈసారి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి, మల్‌రెడ్డి రంగారెడ్డి కాంగ్రెస్ నుంచి, బీజేపీ నుంచి నోముల దయానంద్‌గౌడ్ ప్రధాన పార్టీల అభ్యర్థులుగా రంగంలో దిగనున్నారు.

వేడెక్కనున్న రాజకీయం..

ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో ఇబ్రహీంపట్నంలో రాజకీయ వేడెక్కనుంది. ఇప్పటికే బీఆర్‌ఎస్ నియోజకవర్గంలో ఒక రౌండ్ ప్రచారాన్ని పూర్తి చేసింది. 356 ఓట్లతో గత ఎన్నికల్లో ఓడిపోయిన మల్‌రెడ్డి ఈసారి ఏలాగైన విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్నారు.

గ్రూప్‌లు సర్దుకుంటేనే..

టికెట్ ఆశించి భంగపడ్డ కాంగ్రెస్ ఆశావాహులు మర్రి నిరంజన్‌రెడ్డి, దండెం రాంరెడ్డిడీసీ శేఖర్‌గౌడ్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి విజయానికి ఏ మేర సహకరిస్తారో వేచి చూడాలి. ఆశావాహులతో పాటు పార్టీలోని గ్రూప్ రాజకీయాలు పక్కకు పెడితేనే బలమైన బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని ఢీకొట్టే అవకాశం ఉంటుంది. గ్రూప్‌లు సర్దుకోకుంటే పాత కథనే పునరావృతం అయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.